"ఓం నమో భగవతే రుద్రాయ,
ఓం నమస్తే రుద్రమన్యవ
ఉతో త ఇషవే నమః . . ."

వెంకట్రామయ్యగారు పూజా గృహంలో చేస్తున్న నమకం చమకం పారాయణ శేషుకు శ్రావ్యంగా వినిపిస్తూంది. మండువా చావడిలో వాలుకుర్చీలో కూర్చుని తూర్పు వైపున ఉన్న గుమ్మంలో నుంచి అవతల ఖాళీ స్థలంలో గోడకు ఇవతలగా ఉన్న మేడిచెట్టును చూస్తూ ఉన్నాడు శేషు. మేడి మొక్కను తూర్పు వైపు స్థలంలో పాతడం మంచిదంటూ తన తండ్రికి ఎవరు చెప్పారో తెలియదు కాని, సుమారుగా పదిహేను సంవత్సరాలకు పూర్వం ఆ మొక్కను తెచ్చి పాతారు. తనకూ, తమ్ముడు శ్రీనుకూ 'ఉదయం లేవగానే మేడి మొక్కను చూసి దండం పెట్టండిరా, భాగ్యప్రదం' అంటూ చెప్పి చేయించే వారు కూడా. అది తరవాత తరవాత అలవాటయి పోయింది.

ఆ మొక్క రోజు రోజుకూ పెరుగుతూ చూస్తూండగానే ఎంత పెద్దదయిపోయింది!

స్వరబద్ధంగా, ధారావాహికంగా, వినసొంపుగా ఉంది నాన్న కంఠస్వరం. ఈ ఉచ్చారణకు తెలుగు వారిదే పై చేయి అని అందరూ ఆమోదించినదే. అందులోనూ తన కనిపిస్తుంది — నాన్నగారికి నాన్నగారే సాటి అని.

లక్ష్మి వచ్చి శేషుకు కాఫీ గ్లాసు అందిస్తూ, "తీసుకో, బావా!" అంది.

శేషు ఒక్క క్షణం లక్ష్మి మొహం కేసి చూస్తూ ఉండిపోయాడు.

"తలంటి నీళ్ళు పోసుకున్నావా ఏం?" అంటూ కాఫీ గ్లాసు అందుకున్నాడు.

అవునన్నట్లుగా తల ఊపి, వదులుగా వేసుకున్న జడను ముందుకు లాక్కుంటూ గచ్చు నేల మీద చతికిల బడింది, కాళ్ళు మండువాలోకి ఉంచుతూ.

"చిన్న ఇంకా లేవలేదు" అన్నాడు.

"రాత్రి రాముల వారి గుళ్ళో భజనట. ఏ అపరాత్రి వేళ వచ్చి పడుకున్నాడో తెలియదు."

"నాకు తెలుసు— గడియారం రెండు కొట్టాకే!" ఖాళీ గ్లాసు కింద ఉంచి, "ఇప్పుడు చేసే రాచకార్య మేముందిలే. పడుకోనీ. అసలే రాత్రి నిద్రలేదుకూడా" అన్నాడు.

"మొదటినుంచీ చిన్న బావ ఏం చేసే దానికి చిన్నవాడంటూ అత్తయ్య జాలి చూపడం, నువ్వు వత్తాసు పలకడం తోనే అలా తయారవుతున్నాడు అని




గాలిపోత

చిత్రం- జి. సుధాకరరావు (గుంటూరు)

మామయ్య మొత్తుకుంటున్నా మీ కెవ్వరికీ ఎక్కడం లేదు" అంటూ లేచి ఖాళీ గ్లాసు అందుకుంది.

"ఆగు. నాన్న మాట సరే, నువ్వూ అలాగే అనుకుంటున్నావా?"

"నాకు గుర్తు తెలిసిన నాటి నుంచి ఈ నాటి దాకా చూస్తున్నదే. కనిపించే దాన్ని కాదని ఎలా అనుకోమంటావు?" అనేసి వెళ్ళిపోయింది.

లక్ష్మి మాటల్లో ఆరిందా లక్షణం వ్యక్తమయింది.

లక్ష్మి ఇంకొకరికి సలహా లిచ్చే వయసుకు ఎదిగిపోయింది. అత్తయ్య చనిపోగా మామయ్య మళ్ళీ పెళ్ళి చేసుకుంటే, నాన్న ఆరేళ్ళ పిల్లప్పుడు దాన్ని తమ ఇంటికి తీసుకువచ్చారు.

"నీకు పెద్ద బావంటే ఇష్టమా, చిన్న బావంటేనా?" అందరూ భోజనాలు చేస్తున్నప్పుడు వడ్డన చేస్తూ అమ్మ ఒకసారి అడగగా—"చిన్న బావ నల్లబావ, బాబూ! పెద్ద బావ ఇంచక్కగా తెల్లగా బాగుంటాడు" అంది లక్ష్మి నదురూ బెదురూ లేకుండా.

"నువ్వు బాగున్నావులే మహా! కోతిలా మొహం నువ్వూను!" అన్నాడు వెక్కిరిస్తూ శ్రీను.

"నాది కోతి మొహం ఏం కాదు. నీదే కొండ ముచ్చు మొహం. ఏం, బావా, నేను బాగా లేనూ?" అంటూ తనను అడిగింది.

తను తల వంచుకునే—"బాగుంటావు" అనేసరికి తింటూ తింటూ ఉన్న అన్నం విస్తట్లోనే వదిలేసి కోపంగా లేచి వెళ్ళిపోయాడు శ్రీను.

అది చూసి నాన్న అమ్మను ఉద్దేశించి, "అసలు నీకు బుద్ధి లేదే! భోజనాల దగ్గర ఇటువంటి ప్రసక్తి లెందుకూ?" అన్నారు.

"బాగుంది. నే నేం చేశానూ?" అంది అమ్మ.

"ఏం చెయ్యలేదూ? వెళ్ళి ఆ బాధేదో నువ్వే పడు. వాడిని ఎలా బుజ్జగించి తీసుకు వస్తావో!" అన్నారు.

అమ్మ మొహం చిన్నబోయింది. "వాడు ఇంక ఈ పూటకి రాడు. మీరు కానివ్వండి" అంది.

ఆ రోజు మధ్యాహ్నమే తను లక్ష్మితో అన్నాడు—"నువ్వు శ్రీనును బాధ పెట్టావు" అని.

"ఉన్న మాటే చెప్పాను."

"ఏం ఉన్న మాట? నల్లగా ఉన్న వాళ్ళంతా బాగుండరా? నువ్వూ తెల్లటి తెలుపేం కాదు, చామనచాయ అంటుంది అమ్మ. అయితే, నువ్వూ బాగు లేనట్లేనా?"

"బాగుంటానని ఎందుకన్నావు మరి? నువ్వు నాకు నచ్చులే, బాగులేవే అని చెప్పెయ్యొచ్చుగా" అంటూ బుంగమూతి పెట్టి, ఆ వెంటనే ఉడుకుమోతుతనంతో ఏడ్చేసింది.

"ఛ! ఈ ఏడుపేమిటి? నిన్నేదో చేశాననుకుంటూ అమ్మ వస్తుందేమో? నువ్వు బాగుంటావని ఇందాకే చెప్పానుగా? ఏడుపు మానెయ్యమంటోంటే" అని గడ్డం పట్టుకునేసరికి, తన చెయ్యి తీసి వేస్తూ గౌను ఎత్తి కళ్ళు తుడుచుకుంటూ, "మరి ఈ గొడవంతా దేనికి?" అని అడిగింది.

"శ్రీనునుకూడా బాగుంటాడంటే పోయేది. నల్లగా ఉంటాడంటూ వెక్కిరించావు. వాడు మళ్ళీ రాత్రిదాకా అలాగే పొట్ట మాడ్చుకుంటాడు. అదీ నా బాధ."

"ఎలా మరి?"

"నువ్వు వెళ్ళి పిలుచుకు వస్తావా? గదిలో పడుకున్నాడు."

"అమ్మో! కొడతాడేమో?"

"కొట్టడులే. నేను తలుపుకి ఇవతల ఉంటానుగా? పిలు, మన శ్రీనేగా—పాపం! అన్నం తినలేదుగా?"

"సరే. నువ్వు తలుపుకి ఇవతలే నాకు కనిపిస్తూ ఉండాలి, ఏం?"

"అలాగే."

తను చెప్పినట్లుగా గుమ్మానికి ఇవతలే నిలుచుని ఉన్నాడు. బెదురు బెదురుగానే తలుపు తోసి లోపలకు వెళ్ళింది లక్ష్మి.

"బావా! చిన్న బావా!"

"ఏం?"

"ఊరికే అన్నాను, బావా! తప్పయిపోయింది—అన్నానికి రావూ?"

"నేను రాను. ఫో." కస్సుమన్నాడు శ్రీను. అటు మొహం తిప్పి పడుకున్నాడు.

తనకేసి చూసింది. తట్టి లేపమన్నట్టుగా సంజ్ఞ చేశాడు.

ఇంక రాడన్నట్లు తను సంజ్ఞ చేసింది. తను బతిమాలుతూన్నట్లుగా మొహం పెట్టి లేపమంటూ చేతోత్త చూపించాడు.

లక్ష్మి అలాగే శ్రీను నడుం మీద చెయ్యి వేసి, "రా, బావా! అన్నం తిను. నువ్వు రాకపోతే నా మీద ఒట్టే!" అనగానే లక్ష్మి చేతిని విసిరి కొడుతూ లేచి కూర్చుని, "నువ్వు వెడతావా, రెక్క పుచ్చుకుని గిరవా టెయ్యమంటావా?" అన్నా, లక్ష్మి కదలకపోయేసరికి మంచం మీద నుంచి క్రిందకు ఉరికి లక్ష్మిని ఇంచుమించు గది బయటకు నెట్టేసి, తలుపులు భళ్ళున మూసి లోపల గడియ పెట్టుకున్నాడు.

లక్ష్మి కన్నీళ్ళ పర్యంతం అయ్యేసరికి తనే ఓదార్చాడు.

మొదటినుంచీ శ్రీనుది మంకుపట్టే. 'ఊఁ' అన్నా, 'ఆఁ' అన్నా కోపమే! ఇప్పటికీ వాడు అంతే! అమ్మా, తనూ వాణ్ణి పాడు చేస్తున్నారా?

ఇప్పుడే లేచాడు శ్రీను. తూర్పు గుమ్మం దగ్గరికి వచ్చాడు. మేడి చెట్టును చూసి నమస్కరించి వెనుతిరిగి వెళ్ళి పోతూంటే— "ఏరా, చిన్నా! రాత్రి అంత సేపటిదాకా భజనే?" అని అడిగాడు శేషు.

శేషుకేసి చూడకుండానే — "ఆఁ" అనేసి దక్షిణం వైపున్న నూతి దగ్గరకు వెళ్ళిపోయాడు.

శ్రీను మారితే బాగుండును, ప్రయోజకు డయితే బాగుండునని ఒక్క శేషుకనేమిటి—ఇంటిల్లిపాదికీ ఆకాంక్ష. చదువుకోమని గీపెట్టి పోరు పెట్టినా చదువుకున్నాడు కాదు. చదువు అబ్బిందీ కాదు. చెట్టాయి చెమ్మాయిగా వీధుల వెంట తిరగడం, అమ్మను వేధించి నాలుగయిదు రూపాయలు వారాని కొకసా



- అయ్యల సోమయాజుల రామకృష్ణ శర్మ

రయినా పడి . . ఏమలాపురమో పొయి సినిమాల చూసి రావడం... టెన్త్ క్లాసు మూడుసార్లు తప్పి చదువుకు స్వస్తిచెప్పి ఆరేళ్ళు దాటి పోయింది.

ఈ మధ్య ఊళ్ళో డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నాడని లక్ష్మి ఇవ్వళ్ళేమోసను మోసుకొచ్చింది. అది చెప్పిన దగ్గర్నుంచీ శేషు మనస్సు మనసులో లేకుండా పోతూంది.

వెంకట్రామయ్యగారు పూజ కానిచ్చి, మజ్జిగ తేట తాగి ముండువా చావిట్లోకి వచ్చి, "మళ్ళీ కొబ్బరి ధర డౌనయిందట" అన్నారు శేషుతో.

"ఎంత ఉండేమిటి?" అడిగాడు. శేషు,తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి.

"వెయ్యి కాయ అయిదు వందలకు దిగిపోయిం దంటున్నారు సాహుకారు" అన్నారు బనియను తొడుక్కుంటూ.

"అటక మీద కాయ అలా ఉంచి, ఇక మీదటి నుంచి ఎప్పటి కాయ అప్పు డమ్మేస్తే సరి."

వెంకట్రామయ్యగారు తువ్వాలు భుజంమీద వేసుకుని ముక్కు పొడుం పట్టు పిల్చి, "ధర తొమ్మిది వంద లున్నప్పుడు ఇంకా ఆకాశానికి పెరిగిపోతుందన్న పేరాశతో ఎప్పటికప్పుడు కాయ నిలవ వేశాం. ఏమయినా ఒక నెల చూసి వచ్చిన కాడికి అమ్మేసుకోవడమే మేలేమో! కురిడీ కాయ ఇప్పుడు ఏడు వందలయినా ఉంది. మళ్ళీ ఎలా తగలడుతుందో?" అన్నారు.

"ఇన్నాళ్ళూ అట్టే పెట్టి ఇప్పుడు కంగారా? నెల చూద్దామంటున్నావుగా? అలాగేలే. ఈ వేళ దింపేమో?"

"ఆఁ దింపే! నెత్తి మీద అరవై వచ్చినా నాకీ అగచాట్లు తప్పడంలేదు. వాడు అలా బడుదాయిలా రికామీగా తిరక్కపోతే నెలనెలా తీసే కొబ్బరికాయల దింపు పద యినా నేర్చుకుని ఆ పని చూడరాదూ? అన్నిటికీ నేనే చావాలి. అంతా అస్తవ్యస్తంగా ఏడుస్తూంది వెధవ బ్రతుకు" అంటూ శ్వాస విడిచి, గూడు చెప్పులు తొడుక్కుని పొలానికి వెళ్ళిపోయారు.

శేషు అంతర్యం దెబ్బతిన్న దయింది. నిజమే, ఎన్నాళ్ళని ఇలా సాగబెట గలరు? ఆయనకీ పెద్ద వయస్సు వచ్చింది. ఒక్కో రోజు పొలం నుంచి చీకటిపడి వచ్చాక నాలుగు మెతుకులు కతికి ఒళ్ళంతా కుదుపు, పుల్లపరం అంటూ ముసుగు పెట్ట మూలగడం తను వింటున్నదే. శ్రీనుకు ఒకసారి కాదు, ఎన్నో సార్లు చెప్పాడు — దింపు తీయించడం నేర్చుకో మని.

"ఆగ్నేయం, పడమర, తూర్పు అంటూ ఆ లెక్కలు నాకు అర్థమయి చావవు. పైగా చెట్టు క్రింద నుంచి పైనున్న గెలల పదు చూస్తుండగానే దింపు తీసేవాడు ఇంకో రెండు చెట్ల కాయలు తీసేస్తాడు. ఆగరా అంటే వాడికి విసుపు. నేను ప్రయత్నించాను గాని, నా ఎల్ల కాలేదు. నన్ను చంపకండి" అంటాడు శ్రీను.

"మరి నాన్న ఎలా తీస్తున్నాడురా?" అని అడిగితే — "ఏమో? ఆయనకి సర్వీసయి పోయిందేమో?" అంటాడు.

"నువ్వూ రెండు మూడు సార్లు తీయిస్తే నీకూ అవుతుంది."

"అదిగో మళ్ళీ! చెప్పానుగా — నా వల్ల కాదు ... కాదు ... కాదు" అనేసి వెళ్ళిపోతాడు.

పోనీ, నాన్నకు సాయంగా నయినా వెళ్ళడం మానేశా డీ మధ్య.

క్రితం సారి దింపుకి పనుందంటూ చెప్పిన మాట వినిపించుకోకుండా శ్రీను వెళ్ళిపోవడం చూసిన లక్ష్మి— "పోనీ, నేను వెళ్ళనా?" అంది.

"నువ్వా?!"

"ఏం? మొన్న మొన్నటి దాకా నువ్వూ, నేనూ వెళ్ళలేదా ఏం?"

తను ఒక నిట్టూర్పు విడిచి, "మొన్న మొన్న ఎక్కడ, లక్ష్మీ! రెండేళ్ళ క్రితం మాట అది. నాన్నకు ఇంకా ఓపిక ఉందిలే. నాన్నతో ఇప్పుడు నువ్వు వెళ్ళడం బాగుండదు" అని ఊరుకున్నాడు.

లక్ష్మి అన్నది అబద్ధమేం కాదు. ఒక వైపు అమ్మ 'అది కూడా ఎందుకురా, చూసేవాళ్ళంతా మగ పీరి అనుకుని నవ్వు కోవడానికా' అంటున్నా నవ్వేవాళ్ళ పళ్ళే రాలతాయి,బుగ్గలే సొట్ట పడతాయి,నాకేం అంటూ తనతో పొలానికి తయారయేది. క్రిందపడ్డ కొబ్బరికాయల లెక్క వ్రాయమని నాన్న తన కా పని అప్పచెపితే, లక్ష్మి చెట్టు మీదనుంచి కాయ లొకటొకటి పడుతూండగానే లెక్క పెట్టేసి ఇన్ని వేసుకోమంటూ తనకు చెప్పేది.

"ఆ గెల ఆగ్నేయం కాదు, మామయ్యా! దక్షిణంలో పద్దు వెయ్యి" అంటూ మధ్యలో నాన్నకు సలహా ఇచ్చేది.

"అంతేనంటావా? సరే" అంటూ ఆయన పద్దు సరిచేసుకునే వారు.

ఒక గంట పోయేసరికి అమ్మాయి గారి పని నీరసంలో పడేది. "మామయ్యా! ఇంక మన యంత్రం ఆగిపోయింది. ఆయి లయిపోయింది. . . బొండాలు తీయించవా, మామయ్యా! మరీ లేతవి కాకుండా ముక్క ఉన్నవి" అనేది.

"పదు. మానెయ్యి, నాన్నా! వేషం కాకపోతే, అసలు ఇది రెండు పూటలా దింపుకి వచ్చేది దీనికోసమే."

"నువ్వు తినవేమిటి మహా! నా మాట బయట పడుతుంది కాని, నాతో బాటు నువ్వూ."

ముత్యాల ముగ్గు చిత్రం— బి. యల్. రామాంజనేయులు ( గుంటకల్ )



"నువ్వంటే నువ్వనడం మాత్రం బాగా నేర్చావు!"

"మామయ్య తీయించే వాడయితే, మధ్య నీ కొచ్చిన నొప్పేమిటని?" కోపమూ, అమాయకత్వమూ మిళిత మయిన ముఖ భంగిమ పెట్టే ది.

ఆ స్థితిలో లక్ష్మిని చూడటం తన కెంతో ముచ్చటగానూ, కవ్వింపు గానూ ఉండేది.

అసలు నాన చెప్పాడో, లేదో కాని ఈ లోగా దింపువాడు బొండాలు తీసెయ్యడం, కత్తితో వాటెని చెక్కడానికి మోకాళ్ళ మీద కూర్చోవడం జరిగేది.

నాన్నకూడా వచ్చి కూర్చునే వారు. ఆయన పక్కను లక్ష్మి చతికిలబడగా చూసి, "మరీ ఎడ్డి మాలోకం. పెంటచ్చిలా అలా కూలబడ్డావు, పరికిణీ మాసిపోదూ?" అనే వాడు తను గొంతు కూర్చుంటూ.

"మాసి పోనీయ్, బావా! నువ్వేం ఉతకక్కర్లేదుగా!"

"చిరిగిపోతే?"

"పోతే పోనీ, నువ్వేం కొనక్కరే దుగా!"

ఇదంతా వింటున్న దింపువాడు— "ఈఇద ర్నీఇన్నేళ్ళుగాసూతూ నేఉన్నాగా— ఈడూ, జోడూ. తొందర్లో మూర్తం సూసి ముడేయించండి, బాబూ!" అన్నాడు నాన్నతో.

మరి అంత క్రితం దాక ఉన్న చొరవంతా ఏమయిందో, ఏమో— "పో, వెంకన్నా! నీ కెప్పుడూ ఆ మాటే!" అంటూ మోకాళ్ళ సందులో తల దూర్చేది.

"తప్పు, తల్లీ! మోకాళ్ళ మీద తల తీసేయి" అంటూ నాన్న మంద లించేవారు.

ఇంక దింపు అయాక పాలేరు ఒకటి, రెండు కాయ లెక్కువ ఇమ్మంటూ అడుగుతుంటే నాన్న ఇవ్వను పొమ్మనే వారు.

"రెండు కాయలేగా, పాపం! ఇచ్చేయి, మామయ్యా!. . . ఇవిగో, తీసుకో" అంటూ తనే ముందుకు తోసేది.

"నీళ్ళు పోసుకోవడానికి రా, బావా!" అంటూ లక్ష్మి వచ్చి పిలవడంతో శేషు ఆలోచన ఆగిపోయింది.

"అప్పుడే తొందరేం?"

"అత్తయ్య టిఫిన్ చేస్తోంది, తిందువు కాని."

"ఏం టిఫినేమిటి?"

"నీ కిష్టమయిందే—నేతి పెసరట్లు."

"నాన్న, చిన్న తిన్నారా?"

"మామయ్య కడుపులో బాగు లేదంటూ తినకపోతే, చిన్న బావ అత్తయ్య చెప్పినా వద్దంటూ వెళ్ళిపోయాడు."

శేషు నూతి దగ్గరికి వచ్చి ముక్కాలి పీట మీద కూర్చున్నాడు. లక్ష్మి వేడి నీళ్ళు బిందెతో తెచ్చి పక్కను పెట్టి, రెండు చేదల నీళ్ళు తోడి బిందెలో పోసి చెయ్యి పెట్టి చూసి, "చూసుకో—తీరా ఒక చెంబుడు పొయ్యగానే వేడిగా ఉన్నాయే అంటూ కస్సు మంటావు" అంది, చేతిలో నీళ్ళు శేషు ఒంటి మీద చిలకరిస్తూ.

"అమ్మ, వేడి! చురుక్కుమందే!" అంత చురచురగానూ చూస్తూ అన్నాడు.

"ఇంత పోశం చేసి పెడితే ఇంకా వేడా! ఏం విడ్డూరం? వేడి నీళ్ళు అవస్థ పడి కాచడం ఎందుకు? చన్నీళ్ళే పోసుకుంటే పోదూ?" అంటూ బాల్చీడు నీళ్ళు తోడి అందులో దిమ్మరించేది.

"వేడి నీళ్ళు నాకు కావాలని నే నన లేదుగా!"

"లేదు, బాబూ! నేనే కాచాను, సరా? చలి కాలం అసలే, అబ్బాయి గారికి ఎక్కడ జలుబు చేసి పోతుందో అని" అంటూ చెంబుతో నీళ్ళు తీసి శేషు నెత్తి మీద పోసింది. "కుంకుడు కాయ పులుసు ఉంది, తల మీద పోసి రుద్దమంటావా?" అడిగింది లక్ష్మి.

"కానీయ్."

తల రుద్దడం అయాక శేషు వీపు మీద పులుసు పోసి తోముతూ, "నాకు పెళ్ళేమంటూ వాపోతావు కాని, ఈ సేవలన్నీ చెయ్యడానికి నేను లేకపోతే ఏమ్వేమయి పోవాలి? మాటంటే అనేశావు కాని, ఎద విప్పి చూసుకుంటే నీకే అర్థమవుతుంది ఈ లక్ష్మి ఏ స్థానం ఆక్రమించుకు కూర్చుందో!" అని నీళ్ళు పోసింది.

"నా ప్రయోజనం కోసం నీ చేత అంత త్యాగం చేయించి ఆ తరవాత జీవన శేషమంతా నువ్వు పడే ఆ నరక యాతనను..."

మధ్యలోనే తుంచి వేస్తూ, "త్యాగం ఏమిటి? ఆ తరవాత నరకయాతన ఏమిటి? నేను అలా అనుకోను. అది నాకు ఆనందాన్నీ, తృప్తినీ ఇచ్చేది, బావా! అసలు తెలియక అడుగుతాను—పెళ్ళి అయాకే ఇలా అయితే!" అని తువ్వాలుతో తల ఒత్తుతూ, "నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు— నా మన స్సలా అంటే ఒప్పుకోదు. నువ్వు 'ఊఁ' అంటే నీకు భార్యగా ఈ సేవలు చేసే హక్కు పొందుతాను. కాదన్నాకూడా అవివాహిత గానే ఉండిపోయి ఇలానే నీ సేవ కొనసాగి స్తాను. అంతేనే కాని, నాకు మరొకరితో పెళ్ళి మాట ఎత్తారో ఏటిలో పడి చస్తాను" అంది దృఢంగా.

"లక్ష్మి!"

"అవును, అంతే!" అంటూ లుంగీ పంచ శేషుకు ఇచ్చి లోపలకు నడిచింది.

సరాసరి వంటింట్లోకి వచ్చింది. అక్కడ వాళ్ళత్తయ్య పద్మావతమ్మ పమిట చెంగుతో కన్నీళ్ళు తుడుచు కుంటూ కనుపించింది.

"ఏడుస్తున్నావా, అత్తయ్యా?" ప్రశ్నార్థకంగా చూసింది లక్ష్మి.

"ఏడుపా?. . . కాదు, కాదు. . . కళ్ళలోకి పొగ వెళ్ళి. . ."

కంట్లోకి పొగ వెళ్ళలేదని, అందుక్కాదని పక్కనే ఉన్న నూతి పళ్ళెంలో తామిద్దరూ మాట్లాడుకున్న మాటలు వినిపించడం వల్లే అవి ఆమె చేత కన్నీరు కార్పిస్తున్నాయని లక్ష్మి గ్రహించ టానికి ఆట్టే సేపు పట్టలేదు. లక్ష్మి కనుకొలకుల్లో కూడా నీళ్ళు నిలిచాయి.

•

ఎప్పుడో పొద్దున్న ఎనిమిది గంట లనగా కాఫీ చుక్కలు తాగి వెళ్ళిన శ్రీను, మధ్యాహ్నం రెండు గంటలకు ఒక రిక్షాలో కొత్త ఫేన్, కొత్త రేడియోతో దిగాడు. తనేమో రేడియో తోనూ, ఆ వెనక రిక్షావాడు ఫేన్ తోనూ ప్రవేశించారు ఇంట్లో.

టీ తాగుతూ ఉన్న వెంకట్రామయ్య గారు వాటిని చూస్తూనే, "ఎక్కడివిరా ఇవి?" అని అడిగేశారు.

రిక్షా వాడికి రూపాయి ఇచ్చి పంపేసి, "ఎక్కడి వేమిటి! కొంటే వచ్చాయి. . . లాటరీలో రెండు వేల రూపాయ లొచ్చాయి" అన్నాడు.

"లాటరీలోనే! రెండు వేల రూపాయలే!" అబ్బుర పడింది పద్మావతమ్మ. ఆమె ముఖం వికసించింది.

లక్ష్మి కొత్త వస్తువులను పరిశీలనగా చూస్తూ నిలుచుని పోయింది.

"అలాగా? ఆశ్చర్యంగానే ఉంది సుమా! అటయితే డబ్బు దాచుకోక ఇవన్నీ ఎందుకు తెచ్చావురా?" అన్నారు వెంకట్రామయ్యగారు.

"రేడియో, ఫానూ రెండు అవసర మయినవేగా? మంచి పనే చేశాడు. అమ్మా! ముందు వాడికి అన్నం పెట్టే ప్రయత్నం చూడు" అన్నాడు శేషు.

"వాడు అదృష్టవంతుడని చెపుతూనే ఉన్నానుగా నేను?" అనేసి పద్మావతమ్మ వంట ఇంటికి దోవ తీసింది.

ఈ మాట లక్ష్మి చెవులకు సొంపుగా వినిపించలేదు.

శ్రీను బట్టలు మార్చుకుని అటు వెళ్ళగానే—"నిజంగా లాటరీ లోనే వచ్చిందా లేక ఏదైనా వెధవ పని చేశా డంటావా?" అన్నారు గొంతు తగ్గించి వెంకట్రామయ్యగారు.

లక్ష్మి టక్కున, "మామయ్య అన్నదీ ఆలోచించవలసిందే?" అంది అదోలా కళ్ళు తిప్పి. "గొంతు ఉంది కదా అని ఊఁ అరవకు" అంటూ లక్ష్మిని మందలించి, "మీ కన్నీ అనుమానాలే! చెప్పేవాడు మనిషి కాడా? లాటరీలో వచ్చిందని చెప్పనే చెప్పా డుగా?" అన్నాడు శేషు విసుగ్గా.

వెంకట్రామయ్యగారు ఇంకో అర గంటకు పొలంలో ఏదో పనుందంటూ వెళ్ళిపోయారు. శ్రీను అన్నం తిని వచ్చాక తన గదిలో అలమరలో రేడియోను అరమరికగా అమర్చి, ఏరియల్ కట్టి ఆన్ చేశాడు. ఫాన్ పెట్టుకుని సిలోన్‌లో తెలుగు పాటలు వింటూ పక్క మీద వాలాడు. అలిసిపోయి ఉన్నాడేమో అలాగే కునుకు పట్టేసింది. లక్ష్మి రేడియో కట్టేసి వచ్చి శేషుకు దగ్గరగా నేల మీద కూర్చుంది.

ఆ కుర్చీని అంటి పెట్టుకుని ఏ పొద్దూ అలా శూన్యం లోకి చూస్తూ కాలం పుచ్చే శేషును చూస్తే లక్ష్మికి బాధ, భయం రెండూను. భయం ఎందుకంటే అలా కూర్చుని కూర్చుని వెగటనిపించి ఏ అఘాయిత్య మయినా చేసి వేస్తాడేమో అనే? అందుకనే ఈ దోవ ఆ దోవ వచ్చి పలకరిస్తూ అతని ఒంటరితనాన్ని పోగొట్టాలని దేవుళ్ళాడు తుంది. ఆమె అక్కడ శేషు దగ్గర లేని సమయాల్లో కూడా మనస్సును వదిలేసేది అక్కడే!

"అస్తమానం అలా కూర్చునిపోతే ఏం తోస్తుంది? పోనీ, సందె వేళయినా ఒక గంట అలా తిరిగి వస్తేనో!" అంది లక్ష్మి అర్థింపు ధోరణిలో.

"అలవాటయి పోయింది. మొదట్లో కొంచెం ఇబ్బందిగా ఉండేది. రానురాను ఎలా తయారయ్యానో చెప్పనా? బాహ్య ప్రపంచం చూడాలంటే భీతి కలిగి నాకు ఇదే మంచి దనుకునేలా అయిపోయాను, లక్ష్మి!"

"బావా!"

"ఈ మొండి కాలు, మొండిచెయ్యా— వ్వే! ఈ వాలకాన్ని లోకానికి చూపాలంటే చిన్నతన మనిపిస్తోంది. నేను పిరికివాణ్ణి అయిపోయాను. నాకు ఇటువంటి నిస్స హాయ స్థితి దేవుడు కల్పించి పెట్టాడని కాదు నా బాధ—నన్నా ఏక్సిడెంటునుంచి బ్రతికించి ఈ రూపంలో మీ అందరికీ అప్పచెప్పి ఏడిపిస్తున్నాడనే!"

"అలా అనకు, బావా!" అంటూ మోకాళ్ళ మీద లేచి తన చేతిని శేషు నోటికి అడ్డు పెట్టింది.

ఆమె అశ్రువులను తన ఎడమ చేత్తో తుడిచేస్తూ, "ఇంకా నాపై నీ ప్రేమంతా నిలుపుకుని ఈ అసమర్థుణ్ణి కుమిలి కుమిలి రోదించేలా ఎందుకు చేస్తున్నావు, లక్ష్మి?" అన్నాడు.

ఆమె దుఃఖం మరింత పెల్లుబికి శేషు ఒడిలో తల పెట్టి గొల్లు మంది.

శేషు కనుకొలకులు కూడా తడి పడ్డాయి. ఒకటి రెండు బొట్లు సరిగా లక్ష్మి చెక్కిలి మీద పడ్డాయి. తల పైకి తిప్పి శేషు కళ్ళలోకి వెర్రిచూపులు చూస్తూ కారే కన్నీటిని పట్టించు కోకుండా మూగవోయి ఉండిపోయింది. లక్ష్మి ఒత్తయిన జుట్టులోనికి చేలివేళ్ళు

హంసగీతి చిత్రం— కె. విద్యాసాగర్ (సిద్దిపేట)





స్థాపత్యగణపతి

ఫోటో— పి. వి. చంద్రశేఖర్ (గుడియాత్తం)

న్నట్లుగా చెవులలో గింగురు మంటు న్నాయి శేషుకి.

గుండెను కఠిన పరుచుకోవడానికి యత్నించాడు. "వికాసం వచ్చినా, విధ్వంసం అయినా దీని తోటే జరగాలి. అమ్మ చెప్పినట్లు పెళ్ళి మార్పు తీసుకు వచ్చే అవకాశం నూటికి తొంభై పాళ్ళుంది, లక్ష్మీ!"

"ఉందనుకుంటే నే నా గొంతుకకు ఉరిత్రాడు వేయించుకునేదాన్ని. ప్రయోగాలు చెయ్యాలనుకుంటే ఎవరో ఒకరు పిల్ల నివ్వక పోరు, తెచ్చి చెయ్యండి" అంది, ఎర్రగా అయిపోయిన కనుకొలకుల్లోని నీటిని చేతితో తొలగించుకుంటూ.

శేషు కొంచెం కోపంగా మొదలు పెట్టాడు. "నువ్వు కాదంటే ఆ పనే చెయ్యాలి. . . ఆ తరవాత నువ్వూ, నేనూ కట్ట కట్టుకుని ఏ గోదావరి లోనో ఉరకాలి. ఊరికే ఆవేశపడిపోక నా మాటకు కాస్త విలువ నువ్వయినా ఇచ్చి ఆలోచించు, లక్ష్మీ!" అన్నాడు అనునయంగా.

"నేను చెప్పవలసింది చెప్పాను. ఇంక నా ఆలోచన ఏముందీ? వలచి వలపించుకున్నవాడే తన చేతులతోనే ఇంకొకరికి అప్పగించడానికి ఉబలాట పడిపోతుంటే! అలాగే కానియ్యి" అనేసి ఇంక అక్కడ కూర్చోలేక పమిట కొస నోటికి అడ్డు పెట్టుకుని నడవలోకి వెళ్ళేసరికి అక్కడ శిలా ప్రతిమలా నిలుచుని ఉన్న పద్మావతమ్మను చూడటంతోనే దుఃఖం ఆగక, " అత్తయ్యా ! " అంటూ ఆమె గుండెలపై వాలి వల వలా ఏడ్చింది లక్ష్మి.

(సశేషం)